క్లుప్తంగా

ప్రమాదకరంగా కంకర లారీలు



దోరు తీసుకుని వెళ్తున్న కంకర లారీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట నుంచి తుమ్మలచెరువు వెళ్లే రహదారిపై కంకర లారీలు ప్రమాదకరంగా వెళ్తున్నాయి. కంకర లారీలు వెనుక డోర్లు తీసివేసి నడుపుతుండటంతో కంకర రోడ్డుపై జారి పడుతోంది. దీంతో వెనక వెళ్లే వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకొని లారీల డోర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐరన్ దుకాణంలో సింగరేణి ఇనుము

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని చోరీకి గురైన సింగరేణి ఇనుప వస్తువును బుధవారం రాత్రి సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దశాబ్ద కాలం క్రితం మూసివేసిన పీకే-1 ఇంక్‌లైన్‌లో మూలకు ఉన్న సుమారు 200 కేజీల విలువైన ఇనుప వస్తువును కొందరు వ్యక్తులు దొంగిలించి కమలాపురానికి వెళ్లేదారిలో ఉన్న ఓ ఐరన్ దుకాణంలో విక్రయించారు. ఈ సమాచారం అందిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది.. దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సెక్యూరిటీ అధికారులు, ప్రైవేట్ సెక్యూరిటీ ఫోర్స్ పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు హామీ ఏమైంది?

బూర్గంపాడు: తాము అధికారంలోకి వస్తే పింఛన్లను పెంచి పేదలను ఆదుకుంటామని ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ఏమైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ ప్రశ్నించారు. బుధవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో తెలపాలని కోరారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. స్థానిక ఏఎంసీ కాలనీలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంత మంది విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా నిరుపేద కుటుంబాలు జీరో బిల్లు పథకం అందడం లేదని ఆరోపించారు. సమావేశంలో రాజు, హుస్సేన్, శ్యామ్ సుందర్, రామకృష్ణ, దిలీప్, సామేలు, కనకరాజు, యేసు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

గుండాల: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సాయనపల్లి గ్రామానికి చెందిన దుగ్గి రాంమూర్తి గుండాల వచ్చి సాయనపల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కత్తుల సందీప్ గుండాలకు వస్తున్నాడు. సాయనపల్లి జమ్మిచెరువు వద్ద ఆ రెండు వాహనాలు ఎదురెదుగా ఢీకొన్నాయి. దీంతో వారిరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా గుండాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం ఇల్లందు తరలించారు.

దిష్టిబొమ్మ దహనం

ములకలపల్లి: జమ్మూకాశ్మీర్‌లో యాత్రికుల బస్సుపై ఉగ్రవాదుల కాల్పులను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగదళ్ ములకలపల్లి ప్రఖండ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానసెంటర్లలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా సామరస్యతా ప్రముఖ్ గొడ్ల రాజు, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు పువ్వాల శ్రీనివాస్, భజరంగదళ్ సంయోజక్ అత్యం సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

నియోజకవర్గాల్లో పలు పాఠశాలల్లో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ యూనీఫాం అందించారు. గత పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రనిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్ అందించడమే కాకుండా మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



దమ్మపేట: ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే



భద్రాచలంటౌన్: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్



గుండాల: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు



అశ్వారావుపేటరూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ..



దుమ్ముగూడెం: విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ అందించిన అధికారులు

హరితం.. హతం

ములకలపల్లి: ఎన్నోఏళ్లనాటి చెట్లు నేల రాలుతున్నాయి. చక్కటి నీడ నివ్వడంతోపాటు, ఎంతో ఆహ్లాదాన్ని పంచిన వృక్షాలు భూమట్టమవుతున్నాయి. ములకలపల్లి మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ మంజూరుకాగా, రోడ్డు కిరువైపులా నిర్మాణాలను తొలగించారు. ఇటీవలే నూతనంగా విద్యుత్ స్తంభాలు వేశారు. బుధవారం ఆర్‌అండ్‌బీ పరిధిలోని చెట్ల తొలగింపును మొదలుపెట్టారు. రోడ్డు సమీపంలో ఉన్న మారుజాతి చెట్లను తొలగిస్తున్నారు. కోత మిషన్ల సాయంతో చెట్లను ముక్కలుగా కోసేస్తున్నారు. కళ్లెదుటే ముక్కలౌతున్న చెట్లను చూస్తున్న స్థానికులు, ఏళ్లతరబడి వాటితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అభివృద్ధి పేరిట అనివార్య పరిస్థితుల్లో చెట్లు తొలగిస్తున్న నేపథ్యంలో, మరళా మొక్కల పంపెకం పట్ల దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.





ములకలపల్లిలో నరికేసిన చెట్లు

మట్టిని స్వాధీనం చేసుకోవాలి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలో కొనసాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయడంతో పాటు అక్రమంగా తోలిన మట్టి నిల్వలను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ బుధవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి కొండా చరణ్, మండల కార్యదర్శి సాయన్న మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండలంలో మట్టి, గ్రావెల్ తవ్వకాలు దర్జాగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు రాంశెట్టి, తిరుపతిరావు, వీరాస్వామి, పున్నమ్మ, కన్నయ్య, మైపా రవి తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాస్‌లైన్ నాయకులు

పరిధికి మించి వైద్యం చేస్తే చర్యలు



గ్రామీణ వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

చర్లరూరల్: చర్ల మండలంలోని గ్రామీణ వైద్యులు తమ పరిధిని మించి వైద్యం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని చర్ల, కొయ్యూరు, సత్యనారాయణపురం వైద్యాధికారులు సాయి వర్దన్, శ్రీధర్, దివ్యనయనలు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, డీయంఅండ్‌హెచ్‌ఓల ఆదేశాల మేరకు కొయ్యూరు పీహెచ్‌సీలో బుధవారం మండల గ్రామీణ వైద్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామీణ వైద్యుల వద్దకు వచ్చే ప్రతీ జ్వరం కేసును రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.అధిక డోసు యాంటి బయోటిక్స్, స్టెరాయిడ్స్‌లను వాడవద్దని హెచ్చరించారు. రెండు రోజుల్లో జ్వరం తగ్గకపోతే వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని సూచించారు. ల్యాబ్‌ల నిర్వాహకులు నిర్ధారిత పరీక్ష (ఎలిస్సా)తోనే డెంగీ జ్వరంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, సీహెచ్‌ఓ రామలక్ష్మి, హెచ్‌ఈఓ వేణుగోపాలకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

గుండాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి రేవంత్ అన్నారు. ఆళ్లపల్లి మండలంలోని రాఘవాపురం సమీపంలో ఉన్న గొత్తికోయ గుంపులో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం కేసులు లేవని తెలిపారు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు. కలుషిత ఆహారం, నీరు తీసుకోరాదని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజు భార్గవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'సూటబుల్ జాబ్' సమస్యను పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణిలో పని చేస్తున్న ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్యను పరిష్కరించాలని ఆపరేటర్ల సంఘం నాయకులు ఎస్‌డి.నాసర్‌పాషా యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో జీఎం(పర్సనల్) బీఆర్ దీక్షితులకు కొత్తగూడెం హెడ్డాఫీస్‌లో వినతిపత్రం అందజేశారు. తొలుత నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన జీఎం(పర్సనల్)కు ఆయన పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్ళ క్రితం కేంద్ర కార్మిక శాఖ అధికారుల మధ్యవర్తిత్వంలో సూటబుల్ జాబ్ సమస్యపై ఆరు కార్మిక సంఘాలతో కుదిరిన రాతపూర్వక ఒప్పందం నేటికీ అమలు కాలేదన్నారు. అలాగే అర్హులైన ఆపరేటర్లకు పదోన్నతులు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. సమస్యలపై జీఎం(పర్సనల్) సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

పర్యటనను విజయవంతం చేయాలి

అశ్వాపురం: మండలంలో నేడు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల పర్యటనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య కోరారు. అశ్వాపురం పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ముగ్గురు మంత్రులు గురువారం ఉదయం కుమ్మరిగూడెంలో సీతమ్మ సాగర్ బ్యారేజీ, అమెర్ద, బీజీకొత్తూరు గ్రామాల్లో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్, పంప్‌హౌస్‌ను పరిశీలిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దారి 'చూపు'తున్న సేవలు

- భద్రాచలం ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు
- ఇప్పటికే సుమారు వంద మందికి శస్త్ర చికిత్స
- సిబ్బంది కొరతను అధికమిస్తూ ముందుకు



10 ఏళ్ల బాలుడికి కంటి శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు (ఫైల్)



కంటి ఆపరేషన్ చేస్తున్న వైద్యుడు..

భద్రాచలంఅర్బన్: నయనం ప్రధానం అన్నారు పెద్దలు. చూపు లేకపోతే వారి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుంది. కంటి చూపుకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో రోగులకు కంటి ఆపరేషన్లు చేసే సౌకర్యం కల్పించారు. 200 పడకల ఈ ఆసుపత్రిలో విరివిగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

తొలగిన ఇబ్బందులు..

వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్న పిల్లల నుంచి పెద్ద వయస్సు వారి వరకు కంటి చూపు సమస్యను ఎదుర్కొంటున్నారు. గతంలో కంటి చూపు మందగించిన వృద్ధులు, మహిళలు, యువకులు ఆపరేషన్ చేయించుకోవాలంటే హైదరాబాద్ లేదా ఇతర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. డబ్బులు కూడా ఖర్చు చేసుకోవాల్సి ఉండేది. ఇప్పుడు ఈ ఇబ్బందులు పడకుండా ఎమ్మిగనూరులో ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న ఇల్లందు, అశ్వారావుపేట, కొత్తగూడెంతో పాటు సరిహద్దున ఉన్న ములుగు జిల్లా వంటి ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. కంటి శుక్లాలు ఉన్న వారికి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ఆపరేషన్లు..

గతంలో ప్రైవేట్ ఆస్పత్రులోనే కంటికి సంబంధించిన ఆపరేషన్లు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారి ప్రభుత్వాస్పత్రుల్లో కూడా కంటి ఆపరేషన్లు చేస్తున్నారే ప్రచారం ఇతర ప్రాంతాలకు విస్తరించటంతో రోజు రోజుకూ ఆపరేషన్లు చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. గత ఏడాది 2023 డిసెంబర్ 15న భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మొదటగా ఇద్దరి రోగులకు కంటి వైద్య ఆపరేషన్లు మొదలు పెట్టారు. ఇప్పుడు ఆ సంఖ్య క్రమ క్రమంగా పెరిగుతూ 100కు చేరుకుంది. ఇప్పటి వరకు జరిగిన కంటి ఆపరేషన్లను ఏరియా ఆస్పత్రి వైద్యులు సమర్థవంతంగానే నిర్వహించారు.

ఫ్యాకో పరికరం ద్వారా..

దాదాపు రూ.25 లక్షల ఖర్చు చేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్యాకో పరికరాన్ని భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచింది. క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేసేందుకుగాను ఫ్యాకో పరికరం దోహదపడుతుంది. ఫ్యాకో మిషన్‌తో చేసే క్యాటరాక్ట్ ఆపరేషన్ వల్ల నో ఇన్‌ఫెక్షన్, నో స్టిచెస్, నో ఐ పాడ్స్. కంట్లో ఏర్పడిన శుక్లాల తొలగింపునకు ఈ పరికరాన్ని వాడతారు. పది నిమిషాల్లో ఈ పరికరం ద్వారా క్యాటరాక్ట్ ఆపరేషన్ పూర్తి చేస్తారు. ఇదే క్యాటరాక్ట్ ఆపరేషన్ కోసం ప్రవేట్‌లో రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది.

షెడ్యూల్ వారీగా..



కంటి ఆపరేషన్లు చేస్తుండటంతో రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఆపరేషన్లకు వచ్చే వారికి తేదీలు ఇస్తున్నాం. చుట్టు పక్కల ప్రాంతాల వారు ఉచితంగా చేస్తున్న కంటి ఆపరేషన్లను సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేట్‌కి వెళ్లి పేద ప్రజలు తమ డబ్బులు వృథా చేసుకోవద్దు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కంటికి సంబంధించిన ఆపరేషన్లు ఉచితంగానే చేస్తున్నాం. సిబ్బంది కొరత కారణంగానే ఆపరేషన్ల సంఖ్య తక్కువగా ఉంది.

– డాక్టర్ సంతోష్, కంటి వైద్యుడు, భద్రాచలం ఏరియా ఆస్పత్రి